ప్రజాశక్తి
సోమవారం 28 అక్టోబర్ 2024 8 పేజీలు


ఎన్‌టిఆర్


కృష్ణా

శాస్త్రీయ ఆలోచనల పెంపునకు జెవివి కృషి 5

# ముందుకు సాగని పనులు

- వివిఎంసి ఇంజినీరింగ్ విభాగంలో మూకుమ్మడి బదిలీలు
- సిఇ నుంచి ఎఇ వరకు అందరూ కొత్తవారే
- పలువురికి ఇన్చార్జి బాధ్యతలు
- ఖాళీల భర్తీకి చర్యలు శూన్యం



**ప్రజాశక్తి-విజయవాడ**

విజయవాడ నగరపాలక సంస్థకు గుండెకాయ లాంటిది ఇంజినీరింగ్ విభాగం. ఈ విభాగంలో ప్రస్తుతం గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. మూకుమ్మడిగా ఇంజినీరింగ్ అధికారుల బదిలీల పర్వం సాగింది. చీఫ్ ఇంజినీర్ (సిఇ) దగ్గర నుంచి క్షేత్ర స్థాయి ఎఇ వరకు అందరూ కొత్తవారు కావడంతో ఎక్కడ ఏ ఫైల్ ఉందో... ఎక్కడ ఏ పని చేయాలో...ఏ ప్రాంతంలో ఏ సమస్య ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒకరిద్దరు గతం నుంచి ఉన్నా ఈ పరిస్థితుల్లో వారు ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. అత్యంత ముఖ్యమైన స్థానాల్లో కూడా ఇన్‌ఛార్జీలే గతి అన్నట్లుగా తయారైంది. ఒకరే రెండు, మూడు బాధ్యతలు నిర్వర్తించాల్సిన, పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నగరపాలక సంస్థ ఏర్పడిన దగ్గర నుంచి ఎన్నడూ ఎదురు కాలేదని అనుభవం కలిగిన అధికారులు వివరిస్తున్నారు. ఇటువంటి పరిణామాలు, మార్పులు-చేర్పులకు మూల కారణం ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలే కారణంగా తెలుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధుల, అధికార పార్టీ నేతల సిఫార్సులు వెరసి నగరపాలక సంస్థలో గందరగోళం పరిస్థితి నెలకొంది. నెలల తరబడి ఒక్క పని కూడా చేయించలేని దయినీయ పరిస్థితి ఉంది. ఇటీవల విజయవాడను ముంచెత్తిన వరదల నేపథ్యంలో అత్యవసరంగా చేయించాల్సిన కోట్లాది రూపాయల అంచనా విలువ కలిగిన (మిగతా 2లో)

# ఫిబ్రవరి నాటికి పశుగణన పూర్తి

- 60 శాతం రాయితీపై పశువులకు సంపూర్ణ మిశ్రమ దాణా
- పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు
- కృష్ణాజిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నర్శింహులు



**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి**




ప్రభుత్వం నిర్ధేశించిన గడువులోపు పశుగణన పూర్తి చేస్తామని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని కృష్ణాజిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎన్.సిహెచ్.నర్శింహులు తెలిపారు. పశువుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులైన పశు పోషకులకు అందిస్తున్నట్లు ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

**ప్రశ్న:** పశుగణన సకాలంలో పూర్తవ్వడానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

**జవాబు:** ఐదు సంవత్సరాలకు ఒకసారి పశుగణన జరుగుతుంది. ఈ గణన ఆధారంగానే పశుపోషణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయి. తాజాగా ఈ నెల 25న జిల్లాలో పశు గణన ప్రారంభించాం. 2025 ఫిబ్రవరి 28వ తేదీ నాటికి పశుగణన పూర్తి చేయాలి. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులతో పోస్టర్లు ఆవిష్కరించాం. పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి పశుగణనపై ప్రజలకు అవగాహన కల్పించాం. ఈ గణన పూర్తిగా ఆన్‌లైన్ యాప్‌ద్వారా నిర్వహిస్తున్నాం. 46 మంది సూపర్‌వైజర్లు, 216 మంది ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చాం. గణనకు అవసరమైన (మిగతా 2లో)




# ఆడుకుందామని వచ్చి మృత్యు ఒడికి...

కృష్ణానదిలో మునిగి ఇద్దరు యువకులు దుర్మరణం

వార్త 2లో






# సమాజానికి సాహిత్య సంస్థలు అవసరం

## జానపద అకాడమీ తొలి అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** సమాజం..సాహిత్యం ఉన్నతికి సాహిత్య సంస్థల అవసరం ఎంతో ఉందని జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ అన్నారు. లేపాక్షి ఫౌండేషన్ ఆవిష్కరణోత్సవం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని అనంతపురం ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు కలిసి సాహిత్యం, సమాజ ప్రగతి కోసం ఈ ఫౌండేషన్ ను స్థాపించడాన్ని ఆయన అభినందించారు. ఇలాంటి సంస్థలు మరిన్ని ఏర్పాటు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇతర సాహిత్య సేవా సంస్థలను కలుపుకుంటూ ముందుకుసాగాలని కళా పోషకులు గోళ్ల నారాయణరావు సూచించారు. లేపాక్షి ఫౌండేషన్ స్థాపించిన ఉద్దేశ్యాన్ని అమరావతి ఫౌండేషన్ అధ్యక్షురాలు మద్దుల విజయలక్ష్మి ప్రశంసించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని, అవరోధాలను విజయాలకు సోపానాలుగా మలచుకోవాలని తెలుగు భాష సేవారత్న గణేష్ బోణం అన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన కవులు తమ రచనలను ఫౌండేషన్ ఆవిష్కరణ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో చదివి వినిపించారు. వారిని అతిథులు, నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వడ్డి సుధాకర్, డి.శ్రీనివాసులు, చిన్నారి అనిల్, జి.అశోక్‌లతో పాటు పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.



## వివంత హోటల్‌కు బాంబు బెదిరింపు

**ప్రజాశక్తి-విజయవాడ:** విజయవాడ బందర్‌రోడ్డులోని వివంత హోటల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఈ విషయం తెలుసుకొని వెంటనే రంగంలోకి దిగిన కృష్ణలంక సిఐ నాగరాజు, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది హోటల్‌లో తనిఖీలు చేపట్టారు. అయితే అది అవాస్తమని సిఐ నాగరాజు తెలిపారు. వచ్చిన మెయిల్ కూడా తమిళనాడు విషయాలకు సంబంధించి విజయ్ అనే అతని పేరుతో వచ్చిందని, దానిలో బాంబు బెదిరింపు అనేది ఏమి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి తప్పుడు మెసేజ్‌లతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అలాగే హోటల్స్ కానీ ఇతర సంస్థలు ఏదైనా కానీ పూర్తి స్థాయిలో నిర్ధారణకు వచ్చిన తరువాతనే బయటకు వెల్లడించాల్సి ఉంటుందని, లేనీపోనీ ఇటువంటి ప్రచారం వల్ల ప్రజలు పలు రకాల ఆలోచనలకు గురవుతారని సిఐ తెలిపారు.

## నేడు వినతులు స్వీకరణ

**ప్రజాశక్తి-విజయవాడ:** ఈ నెల 28వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ డా. నిధి మీనా ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, మూడు సర్కిల్స్ పరిధిలోని జోనల్ కార్యాలయాల్లో ప్రజాఫిర్యాదుల వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజలు వారి సమస్యలను వినతుల రూపంలో తెలుపుకోవచ్చని పేర్కొన్నారు.

## అవార్డుకు విఎంసి ఎంపిక

**ప్రజాశక్తి-విజయవాడ:** వీధి విక్రయదారులకు ఎక్కువ రుణాలు కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను ప్రోత్సహించినందుకు విజయవాడ నగరపాలక సంస్థకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు సాధించి, అవార్డుకు ఎంపికైనట్లు నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్‌లో భాగంగా వీధి విక్రయదారులకు అధిక మొత్తంలో రుణాలు కల్పించి, వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచినందుకు రాష్ట్ర స్థాయిలో అవార్డుకు ఎంపికైందన్నారు. మెగా అండ్ మిలియన్ ప్లస్ సిటీస్ క్యాటగిరీలో బెస్ట్ ఫెర్ఫార్మర్‌గా (ప్రైజ్)అవార్డుకు ఎంపికైనట్లు కమిషనర్ తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 29న మంగళవారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ చేతుల మీదుగా అందుకోనున్నట్లు చెప్పారు.

## ఆడుకుందామని వచ్చి మృత్యు ఒడికి...

### కృష్ణానదిలో మునిగి ఇద్దరు యువకులు దుర్మరణం

**ప్రజాశక్తి-తాడేపల్లి**

ఆడుకోవడానికి వెళ్తున్నామని చెప్పి ఇంటి నుండి వచ్చిన యువకులు ఎంతసేపటికీ రాకపోవడం, ఆపైన వారి మరణ వార్త తెలియడంతో రెండు కుటుంబాలు తల్లడిల్లాయి. తాడేపల్లిలోని కృష్ణానది పుష్కరఘాట్‌ల వద్ద నీటిలో మునిగి ఇద్దరు యువకులు మృత్యువాత పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై పోలీసులు, మృతుల బంధువుల కథనం ప్రకారం.. విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరిపేట, అరుణోదయ కాలనీకి చెందిన ఐదుగురు యువకులు ఆదివారం సెలవుల కావడంతో ఆడుకోవడానికి వెళ్తున్నామని ఇంట్లో చెప్పి కృష్ణానదికి వచ్చారు. రైలు బ్రిడ్జి సమీపంలో పుష్కర ఘాట్‌ల స్నేహితులంతా స్నానం చేస్తుండగా సుడిగుండాల కారణంగా చివుకు హేమంత్ కుమార్ (17), గుడివాడ దుర్గాప్రసాద్ (23) మునిగిపోయారు. ఇది గమనించిన మిగతా స్నేహితులు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మత్స్యకారులు వచ్చి వారిని వెలుపలికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. మత్స్యకారుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, మృతుల కుటుంబీకులు, బంధువులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడు హేమంత్ విజయవాడలోని ఎన్‌ఆర్‌ఐ కాలేజీలో ఇంటర్ (బైపిసి) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. తల్లి, సోదరి ఉన్నారు. మరో మృతుడు దుర్గాప్రసాద్ వికలాంగుడు కాగా తండ్రి ప్రైవేటు ఎలక్ట్రీషియన్. దుర్గాప్రసాద్ కూడా అదేపని నేర్చుకుంటున్నాడు. తల్లి, సోదరి ఉన్నారు. ఈ రెండు కుటుంబాల్లోనూ మృతులే ఒక్కగానొక్క కుమారులు కావడం గమనార్హం.

## శరవేగంగా ఏపి అభివృద్ధి : పురంధేశ్వరి

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్‌తో శరవేగంగా ఏపీ అభివృద్ధి చెందుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధేశ్వరి చెప్పారు. ఆదివారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 39వ డివిజన్‌లో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి తగినన్ని నిధులను కేంద్రం ఇస్తోందని, అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు మంజూరు, అమరావతి ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక రైల్వే లైన్ ప్రాజెక్టు నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్ కోసం రూ.12,500 కోట్లు కేంద్రం కేటాయించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, 39వ డివిజన్ బిజెపి కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, మండల అధ్యక్షులు పచ్చిపులుసు శివప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా అధికాం ప్రతినిధి గన్నవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



## మొదటిపేజీ తరువాయి

### ముందుకు సాగని పనులు

వివిధ రకాల పనులు, ఇతర అభివృద్ధి పనులకు మోక్షమెప్పుడో తెలియని వైనం నెలకొంది.

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటైన తరువాత సహజంగా ఆయా శాఖల వారీగా బదిలీలు జరుగుతుంటాయి. స్థానికంగా ఉన్న అధికారుల అనుభవాలు, వారి అవసరాలు, ఇతర అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు జరుగుతుంటాయి. ఇటువంటి ప్రక్రియ జరిగే సమయంలో ఒక శాఖకు (విభాగం) సంబంధించి అక్కడున్న అధికారులు, క్షేత్రస్థాయి పర్యవేక్షించాల్సిన వారిలో 25 శాతం నుంచి 30 శాతం లోపే సహజంగా బదిలీలు జరుగుతుంటాయి. ఒకవేళ ఎక్కువ మంది అధికారులను బదిలీ చేశారనుకున్నా 40 శాతానికి మించి ఏనాడు జరగలేదని పలువురు అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఆ అధికారి నిర్దేశించిన గడువు పూర్తయ్యి బదిలీ చేయాలనుకున్నా అత్యవసరంగా చేయాల్సిన పనులు పూర్తయ్యే దాకా లేకపోతే బదిలీపై ఇక్కడకు కొత్తగా వచ్చిన అధికారులకు సంబంధిత శాఖ కార్యకలాపాలపై కొంత అవగాహన వచ్చేంత వరకు బదిలీ చేసే పరిస్థితి గతంలో ఉండేది కాదు. ఇప్పుడు మాత్రం నగర అవసరాలు, అభివృద్ధి, స్థానిక పరిస్థితులు వీటన్నింటినీ పక్కన పెట్టేసి అధికారపార్టీ నేతలు పైస్థాయిలో వారనుకున్నట్లుగా బదిలీల పర్వాన్ని కానిచ్చేసి నూటికి నూరు శాతం మంది అధికారులను బదిలీ చేశారు. విఎంసిలో స్థానికంగా నెలకొన్న రాజకీయ పరిస్థితులు, గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వీరంతా గత ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారనే ఒకే ఒక కారణంతో ప్రస్తుత ప్రభుత్వం మూకుమ్మడి బదిలీల పర్వానికి తెరలేపిందనే చర్చ బాహాటంగానే వినిపిస్తుంది. నాలుగైదు సంవత్సరాల నుంచి ఇక్కడే తిష్టవేసి ఉన్నారని, అందుకే అందరినీ బదిలీ చేయాల్సి వచ్చిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు.

#### అంతా కొత్తవారే...ఇన్‌ఛార్జిలే...

విఎంసిలో చీఫ్ ఇంజినీర్ (సిఇ) దగ్గర నుంచి ఎఇల వరకు అందరూ కొత్తవారే ఉన్నారు. పలు సర్కిళ్లకు ఇఇ స్థాయి అధికారులు లేక ఇన్‌ఛార్జిలతో అతి కష్టంపై నడుపుతున్నారు. మొన్నటి వరకు చీఫ్ ఇంజినీర్‌గా పని చేసిన ఎం.ప్రభాకరరావు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎడిసి)కు బదిలీ కాగా, ఈయన తరువాత ఎస్ఇగా వచ్చి ఇక్కడే సిఇగా ప్రమోషన్‌పై ఒకటి, రెండు రోజులు పని చేసిన శ్రీరామచంద్రమూర్తి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు. అయితే వీరి స్థానంలో కడప జిల్లాలో పని చేస్తున్న వై.శ్రీనాథరెడ్డికి సిఇగా ఉద్యోగోన్నతి కల్పించి విఎంసికి ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే ఇక్కడ ఎస్ఇలుగా పని చేసిన నర్సింహమూర్తి, రామమోహన్‌రావులను ఎడిసికి నెల్లూరుకు బదిలీ చేయగా, వీరి స్థానంలో సత్యనారాయణ, సత్యకుమారిలను నియమించారు. అలాగే ఇప్పటి వరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఇఇ) గా పని చేసిన ఎఎస్ఎన్ ప్రసాద్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌లను గుడివాడ, బందర్‌కు బదిలీ కాగా, ప్రాజెక్టు డివిజన్ (పీడీ)-2 ఇఇగా ఉన్న వెంకటేశ్వరరెడ్డి సర్కిల్-1, పీడీ-1లకు ఇన్‌ఛార్జి ఇఇ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, సర్కిల్-3 ఇఇ సామ్రాజ్యం సర్కిల్-2కు ఇన్‌ఛార్జి ఇఇగా విధులను పర్యవేక్షిస్తున్నారు. డిఇ స్థాయి అధికారి వెహికల్ డిపోకు ఇన్‌ఛార్జి ఇఇగా బాధ్యతలు చూస్తున్నారు. విఎంసి పరిధిలో ఆరుగురు ఇఇలు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. 11 మంది డిఇలకు కేవలం ఐదుగురు, అలాగే క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన 15 మంది ఎఇలకు కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఎమినిటీ సెక్రటరీలు 286 సచివాలయాల పరిధిలో ఇంజినీరింగ్ వర్క్స్ చూసే 90 మంది మాత్రమే ఉండటం గమనార్హం. కొత్తగా వచ్చిన అధికారులకు అవగాహన వచ్చేదెప్పుడో, పెద్ద సంఖ్యలో ఉన్న ఖాళీల స్థానంలో ఇంజినీర్లను భర్తీ చేసేదెప్పుడో, ఖాళీ ఖజానాతో వరదకు దెబ్బతిన్న రోడ్లు, డ్రెయిన్లు, పైప్‌లైన్లు, ఇతర అభివృద్ధి పనులు గాడిలో పడేదెప్పుడో ప్రశ్నార్థకంగా తయారైంది.

### ఫిబ్రవరి నాటికి పశు గణన పూర్తి

మెటీరియల్‌ను అందించాం.

**ప్రశ్న:** పశువుల వ్యాధులకు వెటర్నరీ ఆసుపత్రుల్లో చికిత్స అందుతోందా?

**జవాబు:** 2019 పశుగణన ప్రకారం ఆవుజాతి 27,261, గేదెలు 3,50, 160, గొర్రెలు 1,71,900, మేకలు 40, 585, కుక్కలు 18,660, కోళ్లు 5, 43,728 ఉన్నాయి. పశు సంవర్ధక శాఖ సంస్థ ఒకటి, ఏరియా వెటెరినరీ ఆసుపత్రులు 13, పశువైద్య శాలలు 59, గ్రామీణ పశువైద్యశాలలు 106లో పశు వైద్య సేవలు అందుతున్నాయి. ఈకాలంలో 14,08,818 రోజువారీ కేసులకు ఆసుపత్రుల్లో చికిత్స అందించాం. జిల్లాలో 2, 52, 949 మెట్రిక్ టన్నులు పాలు, 20,156 మెట్రిక్ టన్నులు మాంసం, 8639.91 లక్షల గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. సంచార పశు వైద్య సేవలో నియోజకవర్గానికి రెండు చొప్పున 14 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. 1962కు ఫోన్ చేసి రైతులు ఇంటి వద్దనే పశు వైద్య సేవలు పొందవచ్చు. సంచార పశు వైద్య సేవ ద్వారా రోజుకు సగటున 9 కేసులకు చికిత్స అందిస్తున్నాం.

**ప్రశ్న:** వ్యాధుల నియంత్రణకు ఆసుపత్రుల్లో టీకాలు వేస్తున్నారా?

**జవాబు:** ఏడాది కాలంలో 15,44,139 పశువులకు టీకాలు వేశాం. నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలలలోపులో ఉన్న 12,325 పెయ్యలకు బ్రూసెల్లా వ్యాధి నియంత్రణకు, 2,80,200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగింది. గొర్రెలు మేకల్లో నీలి నాలుక వ్యాధి, పారుడు, చిటుక వ్యాధిలకు టీకాలు వేస్తున్నాం. పందులలో స్వైన్‌ఫ్లూ వ్యాధి నియంత్రణకు టీకాలు వేస్తున్నాం. సామూహిక నట్టల నివారణ కార్యక్రమంలో 5,41, 384 పశువులకు మందులు అందించాం.

**ప్రశ్న:** ప్రభుత్వ పథకాలు అబ్ధిదారులకు అందుతున్నాయా?

**జవాబు:** రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కె) ద్వారా సంపూర్ణమిశ్రమ దాణా (టిఎంఆర్) 60శాతం సబ్సిడీపై 175 మెట్రిక్ టన్నులు లబ్ధిదారులకు అందించాం. 447 పశువులకు బీమా చేశాం. జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌లో ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నాం. 105 నుంచి 525 గొర్రెలు, మేకలు యూనిట్‌ల ఏర్పాటుకు లబ్ధిదారులకు 50 శాతం సబ్సీడీని ప్రభుత్వం అందిస్తోంది. కృష్ణాజిల్లాలో 18 మంది దరఖాస్తు చేసుకున్నారు. మూడు యూనిట్లు మంజూరు చేశాం. జాతీయ ఉపాధిహామీ పథకంలో జిల్లాకు 1225 మినీ గోకుల యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించారు. 1800 దరఖాస్తులు వచ్చాయి. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పశువుల యజమానులకు రూ. 16 లక్షల వరకు ఎటువంటి గ్యారెంటీ లేకుండా నాలుగుశాతం వడ్డీకి రుణాలు పొందవచ్చు. 621 దరఖాస్తులు వచ్చాయి.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
సోమవారం 28 అక్టోబర్ 2024



# బాబోయ్ ఇసుక ధరలు

● లారీ రూ.35 వేలు ● ట్రాక్టర్ రూ. 7 వేలు ● పనుల్లేక భవన కార్మికుల ఇబ్బందులు



ఆగిన భవనం పనులు

**ప్రజాశక్తి- గన్నవరం :** ఇసుక రేట్లు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం చెబుతున్న మాటలకు ఆచరణకు చాలా తేడా కనిపిస్తుంది. బాబోయ్ ఇసుక ధరలు అన్న పరిస్థితి ఉంది. దీంతో భవన నిర్మాణాలు ఆగాయి. కార్మికులకు పనులు లేక ఇబ్బం దులు పడుతున్నారు. వరదల పేరుతో ఇసుక రీచ్లను మూత పడ్డాయి. వరదలు తగ్గి ఇసుక రీచ్ లు తెరిచిన ధరలు అందుబాటులో లేకపోవడంతో భవన పనులు ఆపారు. గోదావరి నుండి లారీల్లో బ్లాక్ తీసుకొస్తున్నా రేటు వింటే షాక్ అవుతారు. మొన్నటి వరకు టెన్టైర్ల లారీ రూ.15 వేలు ఉండేది. ఇప్పుడు లారీ రూ.30 వేల నుంచి రూ. 40 వేలకు చేరింది. అదేమంటే గోదావరి వద్ద బ్లాక్లో తీసుకోస్తున్నట్లు లారీ డ్రైవర్లు చె బుతున్నారు.

కృష్ణానదిలో ఇసుక రీచ్లు తెరిస్తే చాలా తక్కువ ధరకు ఇసుక వస్తుంది. భవన నిర్మాణాలు వేగంగా సాగుతాయి. ట్రాక్టర్ రూ.3 వేలకు వచ్చేంది. ఇప్పుడు రూ.7 వేలకు చేరింది. భవన యజమానులు పనులు ఆపేసి ఇసుక అందుబాటులోకి తర్వాత చేద్దామని అనుకుంటున్నారు. గన్నవరం పట్టణంలో 200 భవనాలు, 30 అపార్ట్మెంట్లు నిర్మాణం జరుగుతుంది. కూలీలకు చేతినిండా పనులు దొరికాయి. అయితే ఇసుక ధర అందుబాటులో లేకపోవడంతో పనులు ఆపేశారు. దీంతో కూలీలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆద్వర్యంలో పోరాటం చేస్తే ఇసుక అందుబాటులోకి వచ్చింది.

ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతున్న ఆచరణలో రావడం లేదు. ట్రాక్టర్ ఇసుక 7000 పలుకుతోంది. కూలీల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆ సంఘం నాయకులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే రంగంలోకి దిగి ఇసుక ధర నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి : మరియదాసు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి,**



ఇసుక అందుబాటులోకి తీసుకువచ్చి భవన నిర్మాణాలు సాగేలా చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలి. భవన నిర్మాణాలు ఆగితే కార్మికులకు పనులు లేకుండా పోతాయి. దీంతో వారంతా జీవనం సాగక ఇబ్బందులు పడతారు. ప్రభుత్వ వెంటనే ఇసుక అందుబాటులోకి తీసుక రావాలి. ధర నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం



మృతిచెందిన మహిళలు

**ప్రజాశక్తి-గన్నవరం:** రోడ్డు దాటుతున్న ఇద్దరు మహిళలను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతిచెందిన సంఘటన చినఆవుటపల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఆత్కూరు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కంభంపాటి శబరి భవాని (55) పిన్నమనేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన భర్తను, మెరుగు వెంకట పద్మ కుమారి (55) తన బంధువులను చూడటానికి ఆదివారం వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రోడ్డు దాటుతుండగా గన్నవరం నుండి ఏలూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం వేగంగా వారిని ఢీకొంది. దీంతో మహిళలు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దిచక్ర వాహనంనపై ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. క్షతగ్రాతులను స్థానికులు అంబులెన్స్ ద్వారా పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇద్దరు మహిళలు మృతిచెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా ఆత్కూర్ పోలీస్స్టేషన్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బందరులో ముస్లింల ఆందోళన

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ :** మచిలీపట్నం ఇనకుదు రుపేట పోలీస్ స్టేషన్ వద్ద శనివారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇజ్రాయెల్ దాడిలో మృతిచెందిన హిజ్బులా చీఫ్ సయ్యద్ అసిన్ నసరుల్లా కు సంఘీభావంగా శ్రద్ధాంజలి తెలుపుతూ మచిలీ పట్నంలో బ్యానర్ను కట్టగా సిఐ పరమేశ్వరరావు బ్యానర్ని చింపారంటూ స్టేషన్ను ముస్లింలు ముట్టడించారు. దీంతో ముస్లిం మత పెద్దలు, నాయకులు, యువకులు చింపివేసిన బ్యానర్ను పోలీస్ అధికారులకు చూపించి నిరసన తెలిపారు. నూతన బ్యానర్ను స్టేషన్కి ఎదురుగా కట్టి సిఐపై చర్యలు చేపట్టాలని యువకుల నినాదాలు చేశారు. ఆదివారం డీఎస్పీ అబ్దుల్ శుభాన్ని సిఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణ

# టపాసుల విక్రయ లైసెన్స్ ఇప్పిస్తానని టోకరా

● నాలుగు లక్షల రూపాయలతో ఉడాయింపు

**ప్రజాశక్తి-పెడన :** ప్రతి ఏడాది లాగానే ఏ ఈసారి కూడా దీపావళి టపాసులు అమ్ముకునేందుకు లైసెన్స్ ఇప్పిస్తానని ఇద్దరు ప్రబుద్ధులు తీసుకున్న డబ్బులతో హుడాయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి చూసింది. దీంతో బాధితులు స్థానిక ఎమ్మెల్యే వద్ద బోరుని విలపించారు. షాపుల సంగతి దేవుడెరుగు లైసెన్స్ పేరు మీద ఇచ్చిన సొమ్మును తిరిగి ఇప్పించాలని వేడుకొన్నారు. ఈ సంఘటనపై బాధితుల వివరాలు ప్రకారం పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని ఇద్దరు వ్యక్తులు తమకు ఎమ్మెల్యే కష్ణ ప్రసాద్, ఇంచార్జ్ తాసిల్దార్ కూనపు రెడ్డి అనిల్ కుమారలతో పాటు, పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్ లలో తమ తెలిసిన అధికారులు ఉన్నారని నమ్మకం కల్పించారు. దీంతో వారికి దీపావళి మందు గుండు సామాగ్రి అమ్ముకునేందుకు లైసెన్సులు ఇస్తామని చెప్పారు. 16 షాపులు నిర్మించుకునేందుకు ఒక్క షాపు నుంచి 40 వేలు చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక్కో బాధితుల వద్ద నుంచి ఇప్పటికే 20 నుంచి 25 వేల వరకు వసూలు చేశారు. అయితే గత రెండు రోజు లుగా వారిరువురు కనిపించకపోవడంతో మోసపోయా మని గ్రహించిన బాధితులు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆగ్రహించిన ఎమ్మెల్యే సదరు డబ్బులు తీసుకున్న గుప్తులను పిలిపించి హెచ్చరించారు. దీంతో భయపడిన వారు కొంతమందికి సగం సగం చొప్పున తిరిగి ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అయితే ఇంకా సగం మందికి పైగా చెల్లించాల్సి ఉన్నప్పటికీ వీరు త్వరలోనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని మందు గుండు సామాగ్రి అమ్ముకునేందుకు తాసిల్దార్ కార్యాలయంలో 500, ఫైర్ స్టేషన్లో 500 మాత్రమే చలానా రూపంలో చెల్లించాల్సి ఉంది. కానీ విషయం తెలియని బాధితులు వద్ద నుంచి 40 వేల పైగా డిమాండ్ చేయడంతో పట్టణమంతా చర్చనీయంగా మారింది. ఈ విషయంపై ఏఎస్ఐ సురేష్ కుమార్ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. ఫిర్యాదు ఇస్తే విచారించి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

## స్రవంతి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-గన్నవరం :** మచిలీపట్నంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముఖీ సైన్స్ టెస్ట్ క్విజ్లో స్రవంతి హైస్కూల్ విద్యార్థులు ఎం. ప్రణీత, యశ్వంత్ పవన్, సిహెచ్ .రిత్విక్ లు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నవంబర్ 9, 10 వ తేదీలలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## రోడ్డు నిర్మాణం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** మండల పరిధిలోని అశ్వరావు పాలెం-గోధుమొడి ప్రధాన రహదారిని నిర్మిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పంట్రాజు లంకమ్మ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సహకారంతో రూ 33 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. ప్రధాన రహదారుల సమస్య పరిష్కారం కోసం ఓటమి ప్రభుత్వం దష్టి సారించి నిధులు కేటాయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

## యూనియన్ నాయకులకు సన్మానం

**ప్రజాశక్తి - గుడివాడ :** ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ఏర్పడి 60 సంవత్సరాలు అయిన సందర్భంగా వజ్రోత్సవాలను విజయవాడలో ఉన్న అమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ది కృష్ణా జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ జి 1560 సిఐటియు అనుబంధం గుడివాడ యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్ అలియాస్ అమీర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దూస్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావులను వజ్రోత్సవ వేడుకలు సందర్భంగా ఆంధ్ర మోటర్ మర్చంట్స్ అసోసియేషన్ వారు సన్మానించారు.



గుడివాడ యూనియన్ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం




సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

## ఘనంగా ఆరుద్ర శత జయంతి

**ప్రజాశక్తి-గుడివాడ :** సామాజిక ప్రయోజనం కోసం రాసే కవిత్వమే చిరస్థాయిగా నిలచి ఉంటుందని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కె.మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక ఏజికె ఉన్నత పాఠశాలలో సాహితీ స్రవంతి, సాహితీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఆరుద్ర శత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు సాహితీ స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్ర అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్నసాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ నేటి వ్యవస్థలో మానవ సంబంధాలు కూడా వ్యాపారం అయ్యాపోయన్నారు. ఆధునిక కవులు ఆరుద్ర సాహిత్యాన్ని చదవాలన్నారు. ఏ.ఎన్. ఆర్.కళాశాల మాజీ ఉద్యోగులు కొడాలి సోమసుందరావు, కోగంటి చెన్నుగాంధీబాబులు మాట్లాడుతూ పెద్దగా చదువుకోక పోయినా ఏ గురువు వద్ద పరిశోధన చేయకపోయినా ఆరుద్ర రచనలు పరిశోధకులకు మార్గదర్శకంగా నిలిచాయన్నారు. రచయిత్రి పుట్టి నాగలక్ష్మి, సాహితీ మిత్రులు కన్వీనర్ వసుద బసవేశ్వరరావు, కె.టి.ఆర్.మహిళ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కె.ఇందిరాదేవి, కవి వంగా వంశీ, సాహితీ స్రవంతి కార్యదర్శి మాల్యాద్రి, .జి.ఎస్.భాస్కరరావు, వి.నవీన్, యలమర్తి కోటేశ్వర రావు, బి.వి శ్రీనివాసరావు, భాగవతుల ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్లో 'మీ కోసం'

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** ౦జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తా మన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-చల్లపల్లి :** కిడ్నీ బాధితుడిని దాతలు ఆదుకోవాలని ఎస్.ఆర్.వై.ఎస్.పీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం చల్లపల్లి మస్జీదు సెంటరులో కిడ్నీ డయాలసిస్ పెషేంట్ అబ్దుల్ సుభానికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ కోసం దాదాపు రూ.పది లక్షలు అవసరం కాగా, రాంకీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎంవీ రామిరెడ్డి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ డిప్యూటీ హెడ్ చాట్రగడ్డ మహేంద్రబాబు చొరవతో రూ.లక్షన్నర ఆర్థిక సహాయం చెక్ అందచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీడీఆర్ ప్రసాద్, సభ్యులు ఎన్ఎల్ బ్రహ్మేంద్ర, ఎండీ.ఏ.కే.జిలాని, అబ్దుల్ జిలాని, యండూరి చరణ్ పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న దృశ్యం

## టిడిపి సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** టిడిపి అధినేత పిలుపు మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని చిల్లకల్లు గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్‌కి పార్టీ శాశ్వత సభ్యత్వంను జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అందజేశారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురామ్, రావూరి విశ్వనాథం, ముత్తినేని అశోక్, అల్లూరి రమేష్‌కి పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. **వన్‌టౌన్ :** పశ్చిమ నియోజకవర్గం టిడిపి కార్యాలయంలోని పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉత్తరాంధ్ర ఇన్చార్జ్ బుద్దా వెంకన్న తన సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకొని, కార్యకర్తలకు, కుటుంబ సభ్యులకు అభిమానులకు సభ్యత్వం అందించారు. 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న ఇసుక

## నందిగామలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

**ప్రజాశక్తి - నందిగామ :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రతిరోజు రాత్రి సమయంలో కృష్ణానది, మునేరుల నుండి ప్రతిరోజు 100కుపైగా టర్బో టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఏటి పరివాహక గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా మాత్రమే ఇసుక రవాణా చేయాల్సి ఉంది. ఇసుక మాఫియా రాత్రి సమయంలో జెసిబిలతో మునేరు లోపలికి వచ్చి జెసిబిల ద్వారా టర్బో టిప్పర్లకు ఇసుక లోడు చేస్తున్నట్లు తెలిసింది. రాత్రి సమయంలో వందకు వరకు టర్బో టిప్పర్లు తీసుకొని అక్రమ రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కీసర, కంచల, పెండ్యాల ర్యాంపుల్లో కాకుండా ఇతర గ్రామాల సమీపంలో కూడా ఇసుకను తవ్వుతున్నట్లు సమాచారం. ఇసుక వ్యాపారంలో ఇసుక మాఫియాలు లక్షలలో లబ్ధి పొందుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం స్పందించి నిఘా కేంద్రాలను ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎక్సైజ్ అధికారుల దాడులు

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల పరిధిలోని ముచ్చినపల్లి గ్రామంలో ఎక్సైజ్ టాస్కోర్స్ బృందం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 200 లీటర్లు కెపాసిటీ కలిగిన 7 ప్లాస్టిక్ డబ్బాల్లో 1400 లీటర్ల ఎఫ్‌జెవాష్‌ను ధ్వంసం చేశారు. దీనికి సంబంధించిన వ్యక్తి మద్దులపర్వకు చెందిన కోమటి గోపయ్య పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు

# చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ సంబరాలు

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయంగా ఆలోచించే విధానాన్ని అలవాటు చేసుకోవాలని తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రంగా నాగేంద్రబాబు, ఎంఎన్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం రెడ్డిగూడెం గీతాంజలి ఉన్నత పాఠశాలలో జరిగిన చెకుముకి జిల్లాస్థాయి సైన్స్ సంబరాల్లో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని పలు మండలాల నుండి 26 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి.మురళీమోహన్, యల్.గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరావు, జి.మల్లికార్జునరెడ్డి, ఎం.హరికృష్ణ, ఎం.రాంప్రదీప్, ఎస్.ఉషారాణి, గీతాంజలి పాఠశాల డైరెక్టర్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




విజేతలను ప్రకటిస్తున్న దృశ్యం

**చెకుముకి జిల్లా స్థాయి విజేతలు :** ప్రభుత్వ పాఠశాలల విభాగంలో డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకులం, కృష్ణారావులెం విద్యార్థులు సిహెచ్.ఆశ్వీక్, ఎ.రఘుబాబు, కె.అజిత్ టీమ్, ప్రయివేటు పాఠశాల విభాగం తిరువూరు నాగార్జున పాఠశాల విద్యార్థులు టి.హేమ హన్సిక, సిహెచ్.శ్రీనివాసరావు, డి.చరితశ్రీ టీమ్ విద్యార్థులు విజేతలై రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు అర్హత పొందారు. వీరు నవంబర్ 9,10 తేదీలలో విశాఖ జిల్లా పెందుర్తిలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారు.

# ఉద్యోగులను తొలగిస్తే ఆందోళన ఉధృతం

**ప్రజాశక్తి - తిరువూరు :**

సహకార సంఘాల్లో 2019 తరువాత నియామకం పొందిన ఉద్యోగులను తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉధృతంగా ఆందోళన నిర్వహిస్తామని ఎపి పిఎసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సహకార ఉద్యోగుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ 2019 తర్వాత నియామకం పొందిన ఉద్యోగులను తొలగించాలనే చర్యలు నిరసిస్తూ ఇప్పటికే స్టేట్ లెవెల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీకి, ఎస్ఎల్ ఇసికి నిరసన తెలిపి వినతి పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం అయితే ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. దీనికి ఉద్యోగులందరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కూడా సిద్ధం ఉంటుందని తెలిపారు. ట్రేడ్ యూనియన్ నాయకులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు అధైర్య పడవద్దన్నారు. వారి సహకారంతోనే సహకార సంఘాల కంప్యూటరీకరణ, ధాన్యం కొనుగోలు వంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందన్నారు. మీ సేవలను ఉపయోగించుకుంటూ మిమ్మల్ని తొలగించాలనే నిర్ణయంపై మరోసారి ఆలోచించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొవ్వ వెంకటేశ్వరరావు, కార్యని ర్వాక అధ్యక్షులు జె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొల్లినేని రఘురాం

# విశ్వ బ్రాహ్మణులకు పట్టా అందజేత

**ప్రజాశక్తి - విస్సన్నపేట :**

విశ్వబ్రాహ్మణులు వివాహాది శుభకార్యాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం రిజిస్ట్రేషన్ పట్టాను ఆ సంఘ పెద్దలకు ప్రముఖ కాంట్రాక్టర్, టిడిపి సీనియర్ నాయకులు ఎన్‌టి.వెంకటేశ్వరరావు అందజేశారు. విస్సన్నపేట స్థానిక నూజివీడు రోడ్‌లోని కమ్మ సేవాసమితి కళ్యాణ మండపంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గతంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు వివాహాది శుభకార్యాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలం కావాలని ఎన్‌టి.వెంకటేశ్వరరావును కోరారు. ఈ మేరకు స్పందించిన ఆయన 13 సెంట్లు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి ఉచితంగా సంఘ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా స్థల దాత ఎన్‌టి.వెంకటేశ్వరరావును సీనియర్ టిడిపి నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దే), ప్రముఖ కాంట్రాక్టర్ చలసాని వెంకటేశ్వరరావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మారేమండ గ్రామ సర్పంచ్ నందమూరి శ్రీరామచంద్ర, సంఘ గౌరవ అధ్యక్షుడు కాశీ నరసింహారావు మండల అధ్యక్షుడు రంగోజు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కందుకూరి మోహన్, కోశాధికారి కె.శ్రీనివాస్, అక్షర విద్యా సంస్థల అధినేత అరిగే ధనుంజయ్, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి తుమ్మలపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పట్టా అందజేస్తున్న వెంకటేశ్వరరావు

## ఇసుక అక్రమ నిల్వలపై చర్యలు : ఏసిపి

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :**

జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు అక్రమంగా ఇసుక డంపు చేసిన వారిపై, కఠిన చర్యలు తీసుకుంటామని నందిగామ ఎసిపి డాక్టర్ రవి కిరణ్ హెచ్చరించారు. జగ్గయ్యపేట సిఐ, పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ వారు సమయుక్తంగా శనివారం రాత్రి నిర్వహించిన దాడుల్లో మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన రెండు డంపులను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుక డంపులు ఏర్పాటు చేసిన వారిపై కేసు నమోదు చేశారు. ఇసుక డంపులు ఏర్పాటు చేసిన వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో చిల్లకల్లు ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన ఎంఎల్ఎ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని వేదాద్రిలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి కొండపై నెలకొనియున్న స్వయంభూ శ్రీ జ్వాల నరసింహ స్వామి వారి సన్నిధికి వెళ్లేందుకు యాత్రికుల సౌకర్యార్థం దాతచే ఏర్పాటు చేయబడిన ఘాట్ రోడ్డు వెంబడి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి ఇందిరా దత్తు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.



## దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన యాత్రికులు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనానికి ఆదివారం సెలవు రాజు కావటంతో ఉదయం నుండి అమ్మవారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో భక్త జనం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ కెఎస్.రామారావు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సిబ్బందికి సూచనలు చేశారు.

**దుర్గమ్మను దర్శించుకున్న పీయూష్ కుమార్**

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయుష్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దుర్గమ్మకు మొగల్రాజపురం, విజయవాడకు చెందిన మురిగిపూడి వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు ఆలయ ఇఒ కె.ఎస్.రామారావును ఆదివారం కలిసి 22.5 గ్రాముల బంగారు నెక్లెస్‌ను కానుకగా అందజేశారు. అనంతరం వీరికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించగా ఆలయ వేదపండితులు వీరికి వేదార్వచనం చేయగా, ఆలయ ఇఒ వీరికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

## బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే ప్రేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసిన, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసిన, విక్రయాలు జరిపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని దీపావళిని పురస్కరించుకుని బాణాసంచా తయారీ, విక్రయదారులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విక్రయాలు జరిపితే చట్ట ప్రకా రం వారిపై చర్యలు తీసుకుంటామని అన్నా రు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్, ఫైర్‌ఆఫీసర్ పాల్గొన్నారు.

## నేడు హుండీ లెక్కింపు

**ప్రజాశక్తి - మైలవరం :** మండలంలోని బొర్రగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ గోపయ్య వార్ల దేవస్థానంలో సోమవారం ఉదయం 10 గంటలకు యాత్రికులు సమర్పించిన కానుకలను లెక్కించటం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చేలికాని వెంకట సత్య వరప్రసాద్, రెవెన్యూ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో యాత్రికులు, గ్రామస్తుల సమక్షంలో కానుకలు లెక్కించనున్నట్లు తెలిపారు. కానుకలు లెక్కింపునకు ఆసక్తి గల యాత్రికులు దేవస్థాన కార్యాలయంలో తమ పేరును నమోదు చేయించుకోవాలన్నారు.

# శాస్త్రీయ ఆలోచనల పెంపునకు జెవివి కృషి

- జెవివి సైన్స్ సంబరాల్లో మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆశాలత
- రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలకు మచిలీపట్నం
- కాలేఖాన్ పేట మున్సిపల్ పాఠశాల, గన్నవరం స్రవంతి పాఠశాల విద్యార్థులు



సర్టిఫికెట్‌లను అందుకున్న విద్యార్థులు

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి :** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక(జెవివి) కృషి చేస్తోందని ప్రజారోగ్య వేదిక డాక్టర్ సురేష్ చంద్రారెడ్డి, మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డి. ఆశాలత అన్నారు. జనవిజ్ఞాన వేదిక కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నం శ్రీబాలాజీ విద్యాల యంలో చెకుముకి సైన్స్ సంబరాలు 2024ను ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా స్థాయి చెకుముకి టెస్టును సురేష్‌చంద్రారెడ్డి, క్విజ్‌ను ఆశాలతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ చంద్రారెడ్డి, డి.ఆశాలత క్విజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచన దోరణి వ్యక్తి వికాసానికి, శాస్త్రీయ పరిశోధనలకు బాటలు వేస్తుందన్నారు. చెకుముకి టాలెంట్ టెస్టు, క్విజ్‌ల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మోపిదేవి ఎంజెపి పాఠశాల విద్యార్థులు, ప్రయివేటు పాఠశాల విభాగంలో గన్నవరం స్రవంతి స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలు 2024కు ఎంపికయ్యారు. నవంబర్ తొమ్మిదిన విశాఖపట్నంలో జరిగే జెవివి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలకు జిల్లాలోని ఈ పాఠశాలల విద్యార్థులు పాల్గొనే అవకాశం వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో లింగారెడ్డి పాలెం జిల్లా పరిషత్ పాఠశాల (రెండు), మచిలీపట్నం కాలేఖాన్‌పేట జివిఎన్ఆర్ మున్సిపల్ పాఠశాల(మూడు) స్థానాల్లో నిలిచారు. ప్రయివేటు స్కూల్స్ విభాగంలో వీరవల్లి వాణి విద్యానికేతన్ (రెండు), అవనిగడ్డ సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ( మూడు) స్తానాలు నిలిచారు. టాలెంట్ టెస్టు, క్విజ్ కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాల విభాగంలో వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థు లకు విద్యాశాఖ అధికారి సురేష్, డాక్టర్ శంకరానంద్‌లు సర్టిఫికెట్‌లను అందించారు. టెకుముకి టెస్టు చీఫ్ ఇన్విజిలేటర్‌గా ఎస్.రామలింగేశ్వరరావు, క్విజ్ నిర్వహ కులుగా ఎ.ఆంజనేయులు, కార్యక్రమ సమన్వయకర్తగా టి.సునీల్‌మైత్ర వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు రవి, శోభన్ పాల్గొన్నారు.

## కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు



**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీకొండలమ్మ అమ్మవారి ఆలయంలో యాత్రికులు ఆదివారం బారులు తీరారు. అమ్మవారికి తమ తమ మొక్కుబడులు తీర్చుకునేందుకు వేలాది మంది భక్తులు విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పరిశీలించారు.

## వెండి నాగపడగ బహూకరణ



నాగపడక బహూకరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి గ్రామంలోఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి పెడనకు చెందిన పేరిశెట్టి నిరంజనరావు అనంత లక్ష్మీ కుటుంబ సభ్యులు రెండు కేజీల 110 గ్రాముల వెండి నాగ పడగను శ్రీ స్వామికి ఆదివారం ఆలయ ఉపకమిషనర్ కార్య నిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకి అంద జేశారు. దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించారు తీర్థప్రసాదాలు అందించారు.

## రేపు జాబ్ మేళా

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** నిరుద్యోగ యువతీ యువకులత ఈనెల 29వ తేదీ మంగళవారం ఉదయం స్థానిక ఐటిఐ కాలేజీ వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ భగవాన్ తెలిపారు. 2019 నుండి 2024 సంవత్సరాలలో ఐటిఐ ఉత్తీర్ణులైన యువతీ యువకులకు అప్రంటిస్, ఇంటర్, డిగ్రీ వారికీ జాబ్ మేళా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19 సంవత్సరాల నుండి 24 సంవత్సరాల లోపు వారికి వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశం పొందవచ్చని తెలిపారు. కావున అర్హత ఉన్న యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉపాధి పొందాలని కోరారు.



నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఐవిఎం డైరెక్టర్ సురేష్

## నిత్యావసరాలు పంపిణీ

**ప్రజాశక్తి-చల్లపల్లి :** విద్యార్థుల ఉన్నతికి, నిరుపేదల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడుతున్న ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ తన మాతమూర్తి వేములపల్లి విజయమ్మ 70వ పుట్టినరోజు వేడుక (ప్లాటినం జూబ్లీ వేడుకలను) చల్లపల్లి మండలం పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ హెూమ్ లో ఆదివారం నిర్వహించారు. ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆదివారం చల్లపల్లి మండల పరిధిలోని 100 మంది వికలాంగులు, వద్ధులు, వితంతువులకు ఒక్కొక్కరికి రూ.1,200లు విలువ గల నిత్యావసర సరుకులు, దుప్పట్లను రూ.1,20,000ల వ్యయంతో అందించారు. అలాగే 250 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎం ప్రతినిధులు వేములపల్లి రోజా, సోఫీ, తదితరులు పాల్గొన్నారు.







# శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- వర్షాకాలంలో కారుతున్నా పట్టించుకోని వైనం
- భయాందోళనలో అధికారులు, ఉద్యోగులు

**కలెక్టర్ సారు వచ్చారు.. చూశారు.. ఎన్నికలు అయిన తర్వాత నూతన భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేద్దాం.. అని చెప్పి వెళ్లారు.. ఇప్పటి వరకు మరల ఆ విషయం చర్చకు రాలేదు..విధులు నిర్వర్తిస్తున్న చోట భద్రత లేకపోతే ఎలా.. రేపు భవనం కూలిపోయి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అని పలువురు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.**

**ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) :** జిల్లా కలక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న పలు శాఖల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఈ భవనాలు ఎప్పుడు కూలిపోతాయేనని ఉద్యోగులు బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయ ఆవరణలో ఉన్న ఒకే ప్రాంగణ భవన సముదాయంలో సాంఘిక సంక్షేమ,గిరిజన సంక్షేమ,విభిన్న ప్రతిభ వంతులు,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ తో పాటు ఆంధ్ర ప్రదేశ్ విద్య మరియు మౌలిక సదుపాయాల అభివద్ధి సంస్థ మొత్తం ఐదు కార్యాలయల కార్యకలాపాలు జరుగుతుంటాయి. ఆయా శాఖల పరిధిలో జిల్లా అధికారులతో పాటు,ఉద్యోగులు సుమారు వంద నుండి నూట యాభై మంది వరకు విధులు నిర్వహిస్తుంటారు. అయితే వీరందరూ ఇదే కార్యాలయాలలో ప్రతి రోజూ విధులు నిర్వహించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలలో విధులు నిర్వహించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందని వాపోతున్నారు.విధులు నిర్వహించే సమయంలో స్లాబు పెచ్చులు ఊడి పలువురు పది గాయల పాలు అయిన సంఘటనలు ఉన్నాయి. వర్ష కాలంలో అయితే సరే సరే అధికారులు,ఉద్యోగులు కూర్చోవడానికి కూడా అవకాశం ఉండదు. కార్యాలయాలు మొత్తం వర్షం నీరు కారుతుంది. ఇన్ని అసౌకర్యాలు మధ్య వీరు విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాక్షాత్తు జిల్లా కలక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని కార్యాలయ పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటే మండల పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని పలువురు చర్చించుకుంటున్నారు. అలాగే ఈ కార్యాలయాలకు జిల్లా నలు మూలల నుండి వందలాది మంది ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. వందలాది మంది తో నిత్యం రద్దీగా ఉండే ఈ కార్యాలయాలు ఏ క్షణాన కూలిపోతాయో తెలియని పరిస్తితి నెలకొంది. కాబట్టి ఇప్పటికైనా జిల్లా కలక్టర్ స్పందించి ఆయా శాఖల అధికారులతో పాటు ఉద్యోగులకు అలాగే ఈ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

**ప్రతి పాదనలకే పరిమితమైన నూతన భవన నిర్మాణం ...**

శిథిలావస్థకు చేరిన ఈ భవన ప్రాంగణం సముదాయాల స్థానంలో నూతన భవనం ఏర్పా టుకు గత 6 సంవత్సరాల క్రితం రూ 5 కోట్లతో ప్రతి పాదనలు సిద్ధం చేసి అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుల ఆధ్వర్యంలో అప్పటి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించారు.అవి అక్కడితోనే ఆగిపోయాయి.అనంతరం ప్రభుత్వాలు మారడంతో ఈ విషయం మరుగున పడింది.భవనం మరి శిథిలావస్థకు చేరడంతో కార్యాలయాల నూతన భవనం నిర్మాణం ఇప్పుడు మళ్ళ తెరపైకి వచ్చింది.





పైన పెచ్చులూడిన దృశ్యం




## 104 ఉద్యోగులకు భద్రత కల్పించాలి: సిఐటియు

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి.సందీప్ కుమార్ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో 104 ఉద్యోగుల సమస్యలపై చర్చా సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, మండలం కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వమే నేరుగా 104ని నడిపించాలని, ఉద్యోగులకు రావలసిన బకాయిలు, పిఎఫ్ వాటా, ఇంక్రిమెంట్లు గవర్నమెంట్ చొరవ తీసుకుని అరబిందో కంపెనీ నుండి ఇప్పించాలని కోరారు. 104 ఉద్యోగులను గవర్నమెంటు ఉద్యోగాలకు సర్వీస్ వైటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా 104 వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ దుర్గా భవాని పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తవ్వితే చర్యలు

**ప్రజాశక్తి - నందిగామ :** వ్యక్తిగత అవసరాల పేరుతో ఇసుక అక్రమ వ్యాపారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య హెచ్చరించారు. ఆదివారం కాకాని నగర్ కార్యాలయం నుండి ఒక ప్రకటనలో విడుదల చేశారు. వ్యక్తిగత అవసరాల పేరుతో ఇసుక తవ్వకాలు చేపట్టే ప్రాంతాల్లో చట్టాన్ని అమలు చేయాలని, చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు తక్కువ ధరకు ఇసుక ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇసుకపై సీనరేజ్, జిఎస్‌టి రద్దు చేసిందన్నారు. స్థానిక అవసరాలకు నదుల్లో ఇసుక సేకరించేవారు స్థానిక అధికారులకు సమాచారం అందించిన తరువాత మాత్రమే తవ్వకాలు జరపాల్సి ఉంటుందని సూచించారు. ఇసుక తీసుకెళ్లే వాహనాలపై ఉచిత ఇసుక పథకం బ్యానర్ ఉండాలన్నారు. బల్క్ బుకింగ్ ద్వారా ఇసుక కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కేసులు పెట్టడమే కాకుండా పీడీ యాక్టును ప్రయోగిస్తామన్నారు. ఇసుక రవాణాకు ఈ-ట్రాన్సిట్ ఫారం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇసుక రవాణా చేసే ప్రతి వాహనానికి జిపిఎస్, ఉచిత ఇసుక బ్యానర్ ఉండాలన్నారు.

## సిపిఎం సానుభూతి కృష్ణారావుకు నివాళి

**ప్రజాశక్తి - తిరువూరు :** సిపిఎం సీనియర్ సానుభూతి పరుడు, తిరువూరు మధిర రోడ్డు ప్రాంతానికి చెందిన కొత్తపల్లి కృష్ణారావు (75) శనివారం రాత్రి మృతి చెందారు. కృష్ణారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, తదితరులు ఆదివారం మృతదేహాన్ని సందర్శించి పార్టీ కప్పి ఘన నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.



మృతునికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## గ్రంథాలయంలో దియా మేకింగ్ పోటీలు

**విజయవాడ :** ఠాగూర్ స్మారక గ్రంథాలయం గవర్నర్ పేట, విజయవాడలో దీపావళి సందర్భంగా విద్యార్థులకు దియా మేకింగ్ (దీపాల తయారీ) పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చురుకుగా, ఆసక్తిగా పాల్గొని తమలోని సృజనాత్మకతకు పదును పెట్టి రకరకాల దీపాలను తయారు చేశారని గ్రంథాలయ అధికారి కె.రమాదేవి తెలిపారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అధ్వానంగా గణపవరం రహదారి



**ప్రజాశక్తి - మైలవరం :** ప్రభుత్వాలు మారిన రహదారుల దుస్థితి మారటం లేదు. అందుకు నిదర్శనమే మైలవరం నుండి గణపవరం వెళ్లే ప్రధాన రహదారి. మండలంలోని వెల్వడం అడ్డరోడ్డు నుండి గణపవరం వెళ్లే రహదారిపై పడిన గోతులతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు సంవత్సరాలుగా ఈ రహదారిపై పడిన గుంతలను పూడ్చక పోవడంతో ఇటీవల కురిసిన వర్షపు నీరు, రహదారి పైకి చేరి గుంతల్లో చేరటంతో పెద్ద పెద్ద గుంతలు పడి అగాధంలా ఏర్పడింది. ఈ రహదారి గుండా మైలవరం, విస్సన్నపేట, నూజివీడు, ఆగిరిపల్లి, విజయవాడ, నున్న, గన్నవరం తదితర ప్రాంతాలకు నిత్యం పలు వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. రహదారి గుంతల మయంగా ఉండటంతో రాత్రి సమయాల్లో గోతులు కనిపించక పలువురు ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడిన సంఘటనలు ఉన్నాయి. గోతుల్లో పడి ద్విచక్ర వాహనాలు త్వరగా మరమ్మత్తులకు గురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే గంటలు తరబడి ట్రాఫిక్ రహదారిపై నిలిచిపోతుంది. దీంతో పొలాల్లోకి, పలువురు ఉద్యోగులు సమయానికి చేరుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

## అంగన్వాడీ కార్యకర్త, సహాయక పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ఐసిడిఎస్ ప్రాజెక్టు చిల్లకల్లు యూనిట్ నుండి ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చిల్లకల్లు ప్రాజెక్ట్ సిడిపిఓ లక్ష్మీ భార్గవి తెలిపారు. మండలంలోని పోచంపల్లి 2 కేంద్రానికి అంగన్వాడీ కార్యకర్త, జగ్గయ్యపేట 1వ వార్డు 3, అనిగండ్లపాడు 3 పోస్టుకు ఒసి క్యాటగిరిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు వివాహిత మహిళలు మాత్రమే అర్హులని, ఈ ఏడాది జులై ఒకటో తేదీ నాటికి 21 సంవత్సరం నుండి 35 సంవత్సరాలు లోపు వయస్సు కలిగిన వారై ఉండాలని, కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అతి తక్కువ స్థాయి అంగవైకల్యం కలిగిన వారి దరఖాస్తులు మాత్రమే పరిశీలించనున్నట్లు తెలిపారు. వేరొకరి సహాయం లేకుండా తమ పనులు తాము చేసుకొనగలిగి పిల్లల రక్షణ చూసుకొనగలిగిన వారు మాత్రమే అర్హులన్నారు. తమ ధ్రువీకరణ పత్రంతో పాటు విద్యార్హత, నివాసం, కులం, పుట్టిన తేదీ, ఆధార్, అంగవైకల్యం, భర్త మరణించి ఉంటే ధ్రువీకరణ పత్రాలను నవంబర్ 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి వ్యక్తిగతంగా ఒక సెట్టు అందజేయాలని సూచించారు. ప్రతి సర్టిఫికెట్‌పై గెజిటెడ్ అధికారితో ఎటెస్టేషన్ విధిగా చేయించాలని వివరించారు.

## ఆర్‌డిఓ రవీంద్రరావుకు సన్మానం

**ప్రజాశక్తి - నందిగామ :** బదిలీపై వెళ్తున్న నందిగామ ఆర్‌డిఓ ఎ.రవీంద్రరావును కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. పలువురు రెవిన్యూ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని గైడ్ చేసే విధానం, అందరితో కలిసి పని చేసే తీరు, నేను పని ఉంటే పెండింగ్ లేకుండా చేసే విధానం అందర్నీ సపోర్ట్ చేసి ముందుకు తీసుకుపోవడానికి ఆయన వంతు చేసే కృషిని కొనియాడారు. రవీంద్రరావు మాట్లాడుతూ ప్రజలు వరదల్లో ఉన్నప్పుడు అధికారులు అందించిన సేవలు మర్చిపోలేనని, ఎన్నికల్లో అధికారులందరితో కలిసి పనిచేయడం మరువలేనన్నారు. అనంతరం నందిగామ డివిజన్ తహశీల్దార్లు రవీంద్రరావుకు పుష్పగుచ్ఛం, మొమెంటోలు అందించి, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నందిగామ తహశీల్దార్ సురేష్ బాబు, చందర్లపాడు తహశీల్దార్ పాల్, వీరులపాడు తహశీల్దార్ హుస్సేన్, కంచికచర్ల తహశీల్దార్ జాహ్నవి, వత్సవాయి తహశీల్దార్ నరసింహారావు, డిప్యూటీ తహశీల్దార్లు, వేణు కుమారి, ఆర్ఐలు, తహశీల్దార్ కార్యాలయాల సిబ్బంది, రెవెన్యూ డివిజన్ సిబ్బంది, సిసి.త్రినాథ్ పాల్గొన్నారు.



## వైసిపి సోషల్ మీడియా బలోపేతానికి కృషి: తన్నీరు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న విజ్ఞాన్ స్కూల్‌లో ఆదివారం నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సోషల్ మీడియా సమావేశంలో నియోజవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర వైఎస్ఆర్‌సిపి సోషల్ మీడియా వింగ్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ దొడ్డా అంజిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పడిగపాటి చైతన్య రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్ని) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సోషల్ మీడియా సైనికులు పాత్ర మరవలేనిదని, నేడు రాష్ట్రంలో టిడిపి దుష్ట చతుష్టయం, పచ్చ మీడియా దుష్ప్రచారాన్ని వైసిపి సోషల్ మీడియా సభ్యులే తిప్పి కొట్టాలని అన్నారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్‌సి ఓటు నమోదు కేంద్రం

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల, వీరులపాడు మండల యుటిఎఫ్ శాఖల ఆధ్వర్యంలో కృష్ణ గుంటూరు జిల్లాల్లో పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చిలో జరగబోవు ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్ నమోదు కేంద్రం ఆదివారం స్థానిక ఎన్‌జిఒ కేంద్రంలో ప్రారంభించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, జిల్లా కార్యదర్శి డి.హరిప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పులి శ్రీనివాసరావు, పూర్వ మండల ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు ఏడుకొండలు, కె.వెంకట్, వెంకట్, పూల.వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, హఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ టీచర్స్, ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లు, కంచికచర్ల, వీరులపాడు శాఖల ఆధ్వర్యంలో కేంద్రం ప్రారంభం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతను గుర్తించి, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్స్, నిరుద్యోగులు ఓటు నమోదు చేసుకొని భవిష్యత్తులో ఉద్యోగుల, ఉపాధ్యాయులు, కార్మికుల, నిరుద్యోగుల పక్షాన నిలబడే నాయకులను శాసనమండలి పంపించేలా మన నమోదు ఉండాలని పిలుపునిచ్చారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోవాలంటే, యుటిఎఫ్ నాయకులు కె.నాగేశ్వరరావు 9949536359, డి.హరి ప్రసాద్‌ను సంప్రదించి డిగ్రీ సర్టిఫికెట్, ఓటర్ ఐడి, ఆధార్ కార్డు, ఫోటో ఇచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న హరిప్రసాద్

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి - తిరువూరు :** చెకుముకి సైన్స్ టాలెంట్ రాష్ట్ర స్థాయి పోటీలకు తిరువూరు నాగార్జున పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టులో పాల్గొన్న నాగార్జున పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. పదో తరగతికి చెందిన టి.హేమ హన్సిక, 9వ తరగతి చెందిన సిహెచ్.శ్రీనివాస్, 8వ తరగతికి చెందిన డి.చరిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల ఆవరణలో ఆదివారం స్కూల్ ప్రిన్సిపాల్ కె.నరసింహా రావు, కరెస్పాండెంట్ వి.నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్ చైర్మన్ డి.హనుమంతరావు డైరెక్టరు అభినందించారు.

## జిల్లా అధ్యక్షునిగా రామస్వామి

**ప్రజాశక్తి - నందిగామ :** ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా నందిగామకు చెందిన వెంటర్నరీ ఉద్యోగి మాదుగుల రామస్వామి నియమితులైనట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో ఆయన మాట్లాడారు.

## పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలి

**ప్రజాశక్తి - నందిగామ :** పట్టభద్రులందరూ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు నవాబ్ జానీ కోరారు. ఆదివారం నందిగామ పిఆర్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో ఓటు నమోదుకై ప్రత్యేక సహాయక కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఈ ఉచిత సేవా కేంద్రాన్ని పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ ఓటు నమోదుకు వినియోగించుకోవాలని కోరారు. గతంలో ఓటు ఉన్న ఓటర్లు కూడా తప్పనిసరిగా మరల ఓటు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ సహాయ కేంద్రంలో ఓటు నమోదుకు ఫామ్ 18 అందుబాటులో ఉంటాయని, ఓటర్ నమోదు ఆన్లైన్/ఆఫ్ లైన్ ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నందిగామ చందర్లపాడు మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిన్నెర రవికుమార్, మార్కపుడి ప్రభాకర్‌రావు, పటాపంచల రామారావు, గర్నీడి మోగినేశ్వర రావు, జిల్లా కౌన్సిలర్ దాసరి చార్లెస్ మెర్లో, సుబ్బారావు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓట్లు చేర్పించండి

**ప్రజాశక్తి - మైలవరం :** పిఆర్‌టియు మండల కార్యవర్గ అత్యవసర సమావేశం ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పిఆర్టియు మండల అధ్యక్షులు పి.గోపాల్ మాట్లాడుతూ డిగ్రీ, ఆపై ఉత్తీర్ణులు అయినవారిని పట్టభద్రుల ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. మైలవరం, వెల్వడం, చంద్రాల ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయుల వద్ద ఫారాలుఉన్నాయని అవసరమైన వారు సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పుల్లారెడ్డి, సంతోష్, వెంకటేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెంపల్లిలో ఎటుచూసినా సమస్యలే..


గ్రామంలో రోడ్ల దుస్థితి

**ప్రజాశక్తి- గన్నవరం :** గన్నవరం మండలం తెంపల్లి పంచాయతీలో ఎక్కడ చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. పేదల పేటల్లో చెత్తా, చెదారమే కనిపిస్తోంది. మురుగు కాల్వల్లో నీరు పారడం లేదు. దుర్గంధం వెదజల్లడంతో పాటుదోమలు ఉధృతి చెందడంతో జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లలు అంటురోగాల భారిన పడుతున్నారు. పారిశుద్ధం అధ్వాన్నంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. మురుగుతో పెద , బిసి కాలనీ, గంగిరెద్దుల పేట ఏరియాల్లో నివాశితులు బాధలు పడుతున్నారు. డ్రైనేజీలు చెత్తతో నిండిపోయాయని చెప్పారు. మురుగంతా రోడ్డుపైకి వస్తుందని జనాలు చెబుతున్నారు. ఇళ్లలో వాడిన నీరంతా కాల్వలోకి వచ్చి పారకుండా నిలిచిపోతుంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో వీరంతా రంగుమాని దుర్వాసన వస్తుందని చెప్పారు. రోడ్డు లో ఎక్కడపడితే అక్కడ చెత్త పోస్తున్నారు. చెత్త వేయొద్దని అధికారులు చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఏదేమైనా పంచాయతీలో అభివద్ధి పనులు జరగడంలేదని, కనీసం పారిశుద్ధమైనా పటిష్టం చేయడం లేదని జనాలు విమర్శిస్తున్నారు. 4 వేల జనాభా ఉన్న పంచాయతీలో పారిశుద్ధంపై తగిన శ్రద్ధ పెట్టకపోవడం పట్ల అందరూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం కావడంతో చెత్త, చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని లేకుంటే రోగాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్ల సమస్యతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

**అధికారులకు పట్టడం లేదు : వీర్రాజు**

పంచాయతీలో చెత్త సమస్య అధికారులకు పట్టడం లేదు. చెత్తను పోగేయడం లేదు. పేటల్లో చెత్త ఎక్కడ వేయాలో తెలియడంలేదు. చెత్త పారేస్తే కాలువలోకి వెళ్తుంది. మురుగు పారడం లేదు. దోమల తో చస్తున్నాం. మా బాధలు అధికారులకు పట్టడం లేదు.

**నానాఅగచాట్లు పడుతున్నాం : శ్రీను**

మురుగు సమస్యతో జనాలు ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మురుగు కాల్వలు శు భ్రం చేయడం లేదు. నిధులు లేకపోవడమే కారణమని చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం మాటలుతప్ప చేతల్లోకి దిగడం లేదు. దోమలతో రోగాల భారిన పడి జనాలు నానా అగచాట్లు పడుతున్నారు.

## టిడిపి సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ :** మచిలీపట్నం మండలంలోని మంగినపూడి తవసిపూడి అరిసేపల్లి గ్రామాలలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ,మండల పార్టీ అధ్యక్షులు కుంచె నాని,మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, లంకె శేషగిరి మాట్లాడుతూ ప్రతి టీడీపీ కార్యకర్త విధిగా 100 రూపాయలతో సభ్యత్వం నమోదు చేసుకుంటే 5 లక్షల రూపాయల భీమా వర్తిస్తుందన్నారు. పల్లపాటి సుబ్రహ్మణ్యం,మెండు భానుమూర్తి , శ్రీపతి నాంచారయ్య, అమ్మిరెడ్డి శివయ్య ,చండిగ పాండురంగారావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో అవనిగడ్డ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అవనిగడ్డ పార్టీ కార్యాలయం వద్ద టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శ్రీనివాసరావు ప్రారంభించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, మోర్ల రాంబాబు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొన్నారు

## డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా అలీమ్ భాష

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ షేక్ అలీమ్ భాష ఆదివారం భాద్యతలు స్వీకరించారు. ఈయన గుంటూరు జిల్లా బోయ పాలెం డైట్ నుండి ఇక్కడకు బదిలీపై వచ్చా రు. అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికా రిగా పూర్తి అదనపు భాద్యతలు నిర్వహిస్తారు. ఆయనకు డైట్ కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## గోపువానిపాలెం గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్



**ప్రజాశక్తి-పమిడిముక్కల :** గోపువానిపాలెం గ్రామాబివృద్ధికి కట్టుబడి ఉన్నామని గ్రామ సర్పంచ్ యార్లగడ్డ భూషయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో సహకార బ్యాంకు, అంగన్వాడి కేంద్రం, రోడ్ల నిర్మాణం పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. మహత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను పంచాయతీ ద్వారా ప్రజలకు చేరువ ఏ విధంగా కషి చేస్తున్నట్లు తెలిపారు. మండల అధికారులతో సమన్వయంతో గ్రామాభివద్ధి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## జనసేనలో చేరిక

**ప్రజాశక్తి-గుడివాడ :** శ్రీకాళహస్తి కాలనీలో ఆదివారం జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ సమక్షంలో సుమారు 50 మందికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి శ్రీనివాసరావు, ఇంటూరి గజేంద్ర, వేమూరి త్రినాథ్ పాల్గొన్నారు.

## కూరగాయ విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు లో ఆదివారం ప్రతి ఇంటికి కూరగాయ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, పెరుమాళ్ళు, పరంధామయ్య, జి. రామకష్ణ, సిహెచ్. శ్రీధర్, వైపీసీ ప్రసాద్ పాల్గొన్నారు.

## ఇంధన సామర్థ్యం పెంపునకు కృషి

**ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ :** ఇంధన సామర్థ్యం పెంచేందుకు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ కృషి చేస్తుందని ఆసంస్థ ప్రతినిధి ఎస్.కె.రావు తెలిపారు. ఈసం దర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంధన పెంపుకు సంబంధించి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్‌తో ఒప్పందం కుదుర్చు కున్నట్లు తెలిపారు. ప్రదానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మితమవుతున్న 1.5 లక్షల గృహాలకు ఉపకరణాలను అందిం చడం ద్వారా ఇంధన పొదుపు ప్రయోజనాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి గృహానికి నాలుగు ఎల్ఈడీ బల్బులు, రెండు బాటెన్ ట్యూబ్‌లైట్‌లు, రెరండు 5 స్టార్ బీఎల్డీసి ఫ్యాన్‌లతో సహా ఇంధన సమర్థవంతమైన పరిష్కారాలను అందచేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు శక్తి వినియోగంలో గణనీయమైన తగ్గింపును కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## సన్‌ఫీస్ట్ ప్రచారం ప్రారంభం

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** విలేజ్ ఆఫ్ చేంజ్ సరికొత్త నూతన ప్రచారం ద్వారా కుమార్తెలకు వారసత్వ సమానత్వ హక్కులను కలిగించేందుకు అవగాహన కల్పిస్తున్నామని ఐటీసీ ఫుడ్స్ డివిజన్ ఆఫీసర్ ఆలీ హరిస్ తెలిపారు. నగరంలోని ఐటిసి సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుమార్తెలకు కూడా సమాన అవకాశాలు అందించాలనే ఉద్దేశంతో వినూత్నమైన ప్రచారాన్ని సన్‌ఫీష్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల కొన్ని గ్రామీణ ప్రాంతాలలో సన్‌ఫీస్ట్ మామ్ఎస మ్యాజిక్ సంస్థ పరిశోధన నిర్వహించగా ఈఅంశం వెలుగులోకి వచ్చిందని అందుకునే విలేజ్ ఆఫ్ చేంజ్‌తో వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

# గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలి



మాట్లాడుతున్న వై.నరసింహారావు

**ప్రజాశక్తి-మొవ్వ :** సిపిఎం మొవ్వ మండల 8వ మహా సభ మండలంలోని వేములమాడ గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదట పార్టీ జెండాను సీనియర్ నాయకులు బత్తిన రామచంద్ర రావు ఆవిష్కరించారు. అన్ని గ్రామాల్లో దెబ్బతిన్న అంతర్గత రోడ్లు, జిల్లా పరిషత్ రోడ్లు, ఆర్ అండ్ బి రోడ్లు యుద్ధ ప్రతిపాదికన అభివద్ధి చేయాలని, మండల పరిధిలో చిన ముత్తేవి, కాజా గ్రామాలలో అయినం పూడి డ్రైనేజీ పై ఉన్న బ్రెయిలీ వంతెన లను పునర్మించి, మచిలీపట్నం టు మొవ్వ (వయా: చినముత్తేవి) గ్రామం మీదుగా మండల కేంద్రానికి ఆర్టీసీ బస్ సర్వీసులను పునర్ధనం చేయాలని, మండలంలో మేజర్ మైనర్ మురుగు పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, పిచ్చి మొక్క పేరుకుపోయిన మట్టి పూడికి తీయించాలని, నిడుమోలు, కాజ గ్రామాలలో రైతు బజార్లను ఏర్పాటు చేయాలని మహాసభలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె శివ నాగేంద్రం, మండల కార్యదర్శి బొల్లా సుబ్రహ్మణ్యేశ్వర రావు, మండల కమిటీ సభ్యులు మద్దుల బసవరావు, సి. హెచ్. బసవపూర్ణ,జిల్లా కమిటీ సభ్యులు శీలనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏడుగురితో కూడిన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా శీలం నారాయ ణరావుని ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా ఉప్పలపు వెంకటాద్రి, బొల్లా సుబ్రహ్మణ్యేశ్వరరావు,కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్ రావు, మాదాసు నాగులు ,చేబ్రోలు బసపూర్ణని ఎన్నుకున్నారు.



## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** ది స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో జరిగింది. అధ్యక్షులుగా ఎండి హిద యతుల్లా, కార్యదర్శిగా ఎం ఫణి కుమార్, ట్రెజరర్ గా ఎండి అబ్దుల్ గఫూర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎండి బాబర్ మరియు ఉపాధ్యక్షులుగా ఐదుగురు సభ్యులు కార్యదర్శులుగా మరో ఐదుగురు సభ్యులు ఎన్ను కున్నారు. అలాగే ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి. సుధాకర్, మహిళా సెక్రటరీగా ఎం కల్పనను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమానికి ఎలక్షన్ ఆఫీసర్‌గా జి బాలకష్ణ , అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్గా వి. శివలీల, ఎలక్షన్ అబ్జర్వర్ గా బి పద్మ కుమారి వ్యవహరించారు ముఖ్య అతిథిగా ఏ. స్వాములు హాజరయ్యారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా విద్యాశాఖాధికారి ఏవిజె రామారావును మర్యాద పూర్వకంగా కలిశారు.

## మండల కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** నంబర్ ఒకటవ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ విజయవాడలో పర్యటించనున్న సందర్భంగా మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులంతా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ సంద ర్భంగా మండల ఎంఆర్పిఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా సభ్యత్వాలను నమోదు చేశారు. సీనియర్ నాయకులు పేటేటి ప్రభాకర్ మాదిగ అధ్యక్షతన పామర్రు నియోజకవర్గ నియోజకవర్గ అధ్యక్షుడుగా కొల్లూరి దినేష్ మాదిగ, మండల అధ్యక్షులుగా గుంటూరు నాగరాజు మండల కమిటీ అధ్యక్షులుగా.ఇంటూరి భాను (గరికపర్రు). వర్కింగ్ ప్రెసిడెం ట్‌గా నందేటీ. నిరీక్షణ రావు (చాగంటిపాడు), అధికార ప్రతి నిధిగా జుజ్జువరపు.పవన్ (గరికపర్రు), ఉపాధ్యక్షులుగా చలపా టి.వంశీ కిరణ్ (తోట్లవల్లూరు), కార్యదర్శిగా కారుమూడి.రవీంద్ర (భద్రిరాజు పాలెం) ఎన్నుకున్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు మండల పరిధిలోని నక్కవానిదారి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్కిట్ కారణంగా సర్వస్వం కోల్పోయిన పచ్చ వీరబాబు కుటుంబానికి కోడూరు మండల జనసేన పార్టీ నేతలు, జరుగు వానిపాలెం యువత సమీకరించిన 40 వేల రూపాయల నగదును లింగారెడ్డి పాలెం సర్పంచ్ యర్రం శెట్టి శ్రీ దుర్గా చేతుల బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు మరే గంగయ్య, పార్టీ నాయకులు బచ్చు వెంకట్ నాథ్,కష్ణాజిల్లా జన సేన కార్యదర్శి కొండవీటి సునీత, కోట సుబ్బారావు పాల్గొన్నారు

## ఏఎన్ఆర్ కళాశాల నూతన కార్యవర్గం ఎంపిక

**ప్రజాశక్తి-గుడివాడ :** అక్కినేని నాగేశ్వరరావు కళాశాల పూర్వ విద్యార్థి సంఘం కార్యనిర్వాహక కార్యవర్గ ఎన్నికకు సర్వ సభ్య సమావేశాన్ని అదివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ప్రతి రెండేళ్లకు కార్యనిర్వాహక కార్యవర్గ ఎంపిక నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి కె.ఎస్ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నూతన కార్యవర్గం అద్యక్షులుగా కొడాలి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డా॥ బి.శ్యాంకుమార్, కార్య దర్శిగా డా॥ ఎన్.కష్ణమోహన్, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎల్.ఆర్.కె. ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా పి.కష్ణప్రసాద్, ఎం.నారాయణప్రసాద్, ఎ.పరంధామరావు, ఎం.రాఘవేంద్రప్రసాద్, కె.రంగప్రసాద్, డి.ఆర్.బి. ప్రసాద్, వల్లభనేని కిశోర్‌లు నియమితులైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్ పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాశక్తి - విజయవాడ :** సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని క్రైమ్ ఎడిసిపి ఎం.రాజారావు అన్నారు. మాచవరం పోలీస్టేషన్ పరిధిలోని ఎన్‌టిఆర్ అండ్ వెటర్నరీకాలనీ పార్కులో వాకర్స్, పరిసర ప్రాంతాల ప్రజలకు సైబర్ నేరాలు - నివారణా మార్గాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఊరు వెళ్ళే సమయంలో తప్పనిసరిగా లోకల్ పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. ఎల్.హెచ్.ఎమ్.ఎస్‌ను ఉపయోగించుకోవాలన్నారు. దీని వల్ల ఎవరైనా దొంగ ఇంటిలోనికి వస్తే వెంటనే అలారం మోగడంతో పాటు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చేరి దొంగలను పట్టుకోవడంతో పాటు దొంగతనం జరగకుండా చూడవచ్చని అన్నారు. ఇళ్లల్లో ఉండే విలువైన వస్తువులను లాకర్స్‌లో పెట్టుకోవాలన్నారు. నేరం జరిగిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేసేలా, సైబర్ సిటిజన్ యాప్‌పై అవగాహన వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, కాలనీ ప్రెసిడెంట్ సుబ్బారావు, సెక్రటరీ నరసింహారావు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.



## కనీస వేతన జీవో అమలు చేయాలని నేడు ధర్నా

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** కనీస వేతనాల జీవోను అమలు చేయాలని కోరుతూ నేడు ఉదయం 10 గంటలకు తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికులతో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు శివ నాగరాణి పిలుపునిచ్చారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం మేస్త్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కళ్యాణ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. షేర్ మహద్ పేట గ్రామంలో గత వారం రోజులుగా వ్యవసాయ కూలీలు స్వచ్ఛందంగా తమకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ చేస్తున్న సమ్మెకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కూలీలకు కనీస వేతనం ఇవ్వాలని, జీవో నెంబర్ 73ను 2012 వ సంవత్సరంలో విడుదల చేసిందన్నారు. ఈ జీవో ప్రకారం ఇప్పుడు కూలీలకు కలుపు తీత, ఇతర తేలకపాటి పనులకు కనీసం మన ప్రాంతంలో రూ.438లు ఇవ్వవలసి ఉన్నది కానీ కూలీలు అడిగేది గొంతెమ్మ కోరికలని రైతులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. కూలీలు అడిగే కనీసం రూ.300లు ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలి రేట్లు పెంపు కోసం సోమవారం తహశీల్దార్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాలో కూలీలు, మేస్త్రీలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు కాకనబోయిన లింగారావు, జుజ్జువరపు వెంకటరావు, మేస్త్రులు, కూలీలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల మండలం, పరిటాల పరిధిలో దొనబండ వద్ద జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు నుండి విజయవాడ వెళ్తున్న ఇన్నోవా కారును దొనబండ క్రషర్ రోడ్డులో నుండి వస్తున్న టిప్పర్ వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న కనుమూరి శివరావు అనే వ్యక్తితో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 1033లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆధునీకతతో మెరుగైన చికిత్స



**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** మధుమేహం, ఎండోక్రైనాలజీ చికిత్సల్లో విప్లవాత్మక ఆవిష్కరణలు చోటుచేసుకున్నాయని యలమంచి డయాబెసిస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్, ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్ డాక్టర్ యలమంచి సదాశివరావు తెలిపారు. వైడిఆర్‌ఎఫ్ డయాబ్ ఎండో కాన్ 2024 సదస్సు నగరంలోని జీఆర్టీ గ్రాండ్ హోటల్లో ఆదివారం జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ సదాశివరావు ప్రసంగిస్తూ మధుమేహం, ఎండోక్రైనాలజీ విభాగాలకు సంబంధించి అందుబాటులోకి వచ్చిన ఆధునిక చికిత్సా విధానాలతో ప్రజలకు మరింత మెరుగైన చికిత్సలు అందించేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. అత్యాధునిక పరిజ్ఞానం, నవీన ఆవిష్కరణల గురించి డయాబ్ ఎండోకాన్ 2024లో సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు. నూతన చికిత్సా విధానాల గురించి వైద్య నిపుణులు అవగాహన పెంపొందించుకునేందుకు ఈ సదస్సు అద్భుతమైన వేదికగా నిలిచిందని డాక్టర్ సదాశివరావు తెలిపారు. దాదాపు 500 మంది వైద్యులు హాజరైన ఈ సదస్సులో 25 మంది ప్రముఖ వైద్య నిపుణులు వివిధ అంశాలపై ప్రసంగించారు. ప్రీ డయాబెటిస్, టైప్-1 డయాబెటిస్, టైప్-2 డయాబెటిస్, హార్మోన్ సమస్యలు, వాటి చికిత్సల గురించి నిపుణుల ప్రసంగాలు విశ్లేషణాత్మకంగా సాగాయి. ప్రీ డయాబెటిక్ దశలోనే సమస్యను గుర్తించి అడ్డుకోవడం, మధుమేహ వ్యాధిని తిప్పికొట్టడం, టైప్-1 డయాబెటిస్ నియంత్రణకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఔషధాలు, మధుమేహ నియంత్రణలో శరీర బరువు నియంత్రణ యొక్క పాత్ర తదితర అంశాలపై సదస్సులో కూలంకుషంగా చర్చ జరిగింది. సంబంధిత అంశాలపై ప్రతినిధులు అడిగిన సందేహాలకు వైద్య ప్రముఖులు వివరణాత్మకంగా సమాధానాలిచ్చారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ రెండు సిఎంఇ క్రెడిట్ పాయింట్లను కేటాయించింది. యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ డయాబ్ ఎండోకాన్ 2024లో ప్రముఖ ఎండోక్రైనాజిస్ట్ డాక్టర్ కృష్ణ శేషాద్రికి గోల్డ్ మెడల్ ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైడిఆర్‌ఎఫ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచి, సెక్రటరీ డాక్టర్ ఐశ్వర్య యలమంచి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ అమూల్య యలమంచి తదితరులు పాల్గొన్నారు.

## నందిగామలో తక్షణమే మంచినీరందించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ పట్టణంలో తక్షణమే మంచినీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నందిగామలో సిపిఎం నందిగామ పట్టణ 14వ మహాసభ జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిరంతరం సిపిఎం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ముఖ్యంగా నందిగామ పట్టణంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రజలకు తాగునీరు అందించటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం నందిగామ పట్టణ కార్యదర్శిగా కటారపు గోపాల్ ఎన్నికయ్యారు. సిపిఎం నందిగామ పట్టణ కమిటీ సభ్యులుగా సయ్యద్ ఖాసిం, వల్లూరు రవి శేఖర్, కర్రి వెంకటేశ్వర రావు, గోపినాయిక్, మండూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వర రావు, ఆకుల వెంకటనారాయణ ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చనుమ్మోలు సైదులు, సిపిఎం నాయకులు లాజరు, బత్తుల వెంకటేశ్వర్లు, పుల్లయ్య, ఉప్పు శ్రీను, హస్సేన్, మహిళా నాయకులు సయ్యద్ బాజీద్బీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ

## సోనీ వైర్‌లెస్ ఇయర్‌బడ్స్ విడుదల

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** వినూత్న లింక్‌బడ్స్ సిరీస్, డబ్ల్యుఎఫ్ - ఎల్910 (లింక్‌బడ్స్ ఓపెన్) వైర్‌లెస్ ఇయర్‌బడ్స్‌కు తాజా జోడింపును విడుదల చేస్తున్నట్లు సోనీ ఇండియా రీజనల్ మేనేజర్ ఎస్.సుకుమార్ తెలిపారు. నగరంలోని సోనీ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. సౌలభ్యం, కనెక్టివిటీ, అత్యుత్తమ శబ్ద నాణ్యతను కోరుకునే వినియోగదారుల కోసం ఈ ఇయర్‌బడ్‌లు అత్యాధునిక సాంకేతికత, అందిస్తుందన్నారు. ఆకర్షణీయ మమైన డిజైన్‌తో కలిసి లీనమయ్యే సహజమైన ఆడియో అనుభవాన్ని అందిస్తాయని తెలి పారు. డబ్ల్యుఎఫ్-ఎల్910 వైర్‌లెస్ ఇయర్‌బడ్‌లు తేలికపాటి, కాంపాక్ట్ డిజైన్, కొత్తగా అభివృద్ధి చేయబడిన ఎయిర్ ఫిట్టింగ్ సపోర్టర్లతో జత చేయబడిందన్నారు. ఐపిఎక్స్4 వాటర్ రెసిస్టెంట్ రేటింగ్‌కు మద్దతు ఇస్తుందన్నారు.

## ఐడిబిఐ లాభాల్లో 39 శాతం వృద్ధి

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ఐడిబిఐ బ్యాంక్ ప్రకటించింది. ఈ త్రైమాసికానికి నికర లాభం రూ.1,868 కోట్లుగా ఉండగా, ఇది ఏడాది నుంచి ఏడాదికి 39 శాతం వృద్ధిని నమోదు చేసిందనీ బ్యాంక్ ప్రతినిధి పి.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ లాభం 45 శాతం వృద్ధితో రూ. 3,006 కోట్లకు చేరుకుందని, నికర వడ్డీ మార్జిన్ 4.87 శాతం నమోదు కాగా, నికర వడ్డీ ఆదాయం 26 శాతం వృద్ధితో రూ. 3,875 చేరుకుందని అన్నారు. నికర ఎన్పీఎ నిష్పత్తి సెప్టెంబరు 30, 2023 నాటికి 0.39 శాతం నుంచి సెప్టెంబరు 30, 2024 నాటికి 0.20 శాతానికి మెరుగుపడిందని పిసిఆర్ 99.42 శాతం ఏడాది నుంచి ఏడాదికి మెరుగుపడి 32 బిపిఎస్ పాయింట్లకు చేరుకుందని తెలిపారు.

## ఓవరాల్ ఛాంపియన్ విజయనగరం

### ముగిసిన 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల సైక్లింగ్ టోర్నమెంట్

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్ - 14, 17, 19 బాలుర, బాలికల సైక్లింగ్ టోర్నమెంట్‌లో విజయనగరం జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. మూడు విభగాల్లో ఆ జిల్లా సైక్లిష్టులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 34 పాయింట్లను సాధించి జిల్లాకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించడంలో కృషి చేశారు. 31 పాయింట్లతో గుంటూరు జిల్లా జట్టు రెండోస్థానంలో నిలవగా, ఆతిథ్య ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు 21 పాయింట్లతో మూడోస్థానంలో నిచిలింది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎపిఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ యూనిట్ పర్యవేక్షణలో రెండు రోజులపాటు నున్న జడ్పీ హైస్కూల్ స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారిపై సైక్లింగ్ పోటీలను నిర్వహించింది. మొత్తం 13 ఉమ్మడి జిల్లాల నుంచి 300 మంది సైక్లిస్టులు పోటీలలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ పోటీలలో ఆయా విభాగాలలో తొలి రెండు స్థానాలలో నిలిచిన వారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) నేషనల్స్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రెండు రోజులపాటు జరిగిన సైక్లింగ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ గేమ్స్ ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) సైక్లింగ్ కోచ్ వీ కనకారావు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు. వ్యక్తిగత అంశాలలో విజేతలుగా నిలిచిన వారికి రిటైర్డ్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (ఖాజీపేట) వేణుగోపాలరావు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు నరెడ్ల సత్యనారాయణరెడ్డి, గుంటక శివ శేషిరెడ్డి (బాబు) మెడల్స్‌ను ప్రదానం చేశారు. కృష్ణాజిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె సుగుణరావు, సైక్లింగ్ టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు టి.శ్రీలత, టి.విజయ వర్మ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఆంధ్రా మోటార్స్ వజ్రోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** అమ్మలో ఉండే మాధుర్యం ఆంధ్రా మోటార్స్ అసోసియేషన్ సభ్యుల్లో ఉంటుందని విజయవాడ తూర్పు నియోజవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నగరంలోని మొగల్రాజపురం సున్నంబట్టిలు సెంటర్ అమ్మ కల్యాణ మండపంలో ఆంధ్రమోటార్స్ మర్చంట్ అసోసియేషన్ 60 వసంతాల వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గారపాటి విజయకుమార్, తూర్పు నియోజవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ నేత బొప్పన భవకుమార్ పలువురు ప్రముఖలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ సత్కారించారు. అనంతరం అసోసియేషన్ సావనీర్ అవిష్కరించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ అమ్మలో ఉండే మాధుర్యం ఆంధ్రా మోటార్స్ అసోసియేషన్ సభ్యుల్లో ఉంటుందన్నారు. అమ్మ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉపయోగకరమైన సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున్న చేశారని వివరించారు. అమ్మ అసోసియేషన్ అధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ 60 వజ్రోత్సవ వేడుకలు జరుపుకోవడం అనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ అసోసియేషన్ అధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వరావు ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, జి వి సుబ్బారావు, గారపాటి సతీష్ బాబు, డి.దుర్గా ప్రసాద్ పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


సావనీర్ ఆవిష్కరిస్తున్న గద్దె రామ్మోహన్‌రావు, తదితరులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.